అనేక పత్రికలు, నవలలు చదివే మీలోని ఊహాశక్తిని ఉపయోగించండి. ఈ కింది కథ చదివి దానికి ఏ పేరు పెడితే బావుంటుందో ఊహించి కింది బాక్సులో మీరే రాయండి.

అమాయకరావు ఒకరోజు పనిమీద పట్నం వెళ్ళాడు. పని పూర్తి అయ్యేసరికి బాగా చీకటి పడింది. తిరిగి తన ఊరు వెళ్ళే చివరి బస్సుకూడా దాటిపోయిందని తెల్సి అతనికేం చెయ్యాలో పాలుపోలేదు. అతనికి పట్నంలో తెలిసిన బంధువులుగాని, స్నేహితులుగాని ఎవ్వరూ లేరు. ఆ రాత్రి తల దాచుకోవడానికి ఎవర్నయినా ఆశ్రయం అడుగుదామని బస్‌స్టాండ్ నుండి ఊర్లోకి వెళ్ళాడు.

ఒక ఇంటి తలుపు తట్టాడు. ఆ ఇంటి ఇల్లాలు తలుపు తెరచి ఏంకావాలి బాబు? అని అడిగింది.

అమాయకరరావు అమాయకంగా జాలిగా ఆమెవైపు చూసి "పొరుగూరు కొంతంగి నుండి వచ్చాను. తెలిసిన వారెవరూ లేరు, దయచేసి ఈరాత్రికి మీ ఇంట్లో పడుకోనిస్తారా?" అని అడిగాడు.

"ఇంట్లో వయసొచ్చిన ఆడపిల్ల ఉంది, నీలాంటి వాళ్ళకి ఆశ్రయం ఇస్తే జరిగే అనర్థాలు చాలా చూసాం" అంటూ దభేలున తలుపు మూసింది.

అమాయకరావు మరో ఇంటికి వెళ్ళి తన అవస్థ చెప్పుకొని ఆశ్రయం అడిగాడు. "ఇంట్లో ఉన్న ఆడపిల్లల్ని చూసి ఆశ్రయం పేరుతో నాటకాలాడుతున్నావంటూ" నానా తిట్లుతిట్టి అమాయకరావుని బయటకు తోసాడు ఆ ఇంటి యజమాని.

అలా చాలాచోట్ల వయసొచ్చిన ఆడపిల్లలుండటం వలన తనకు ఆశ్రయం దొరకడం లేదని తెలుసుకొన్నాడు అమాయకరావు.

చివరి ప్రయత్నంగా ఒక ఇంటికి వెళ్ళి తలుపు తట్టాడు. అది పోలీసాఫీసరు ఇల్లని తనకేం తెలుసు? ఆ పోలీసాఫీసరు తలుపు తీసి "ఏంకావాలి?" అని అమాయకరావుని అడిగాడు.

"మీ ఇంట్లో వయసొచ్చిన ఆడపిల్లలు ఉన్నారా" అన్నాడు అమాయకరావు అమాయకంగా.

అమాయకరావు మాటలకు చిర్రెత్తుకొచ్చింది ఆ పోలీసాఫీసరుకి, అయినా కోపాన్ని దిగమ్రింగుకొని 'ఎందుకు?' అని అడిగాడు.

"ఈ రాత్రి [కి] పడుకుందామని" అని అమాయకంగా అన్నాడు అమాయకరావు.

ఆ మాటలు పూర్తి కాకుండానే కళ్ళముందు నక్షత్రాలు కనిపించాయి. అమాయకరావుకి, పోలీసాఫీసరు కొట్టిన దెబ్బలికి దిమ్మతిరిగి క్రింద పడ్డాడు. మళ్ళీ కళ్ళు తెరచి చూసేసరికి జైలు గదిలో ఉన్నాడు. పాపం! అమాయకరావు.

**—బి.ఎల్. నారాయణ**

కత్తిపూడి-533455

వయా చేబ్రోలు, తూ.గో. జిల్లా

*స్రవంతి నెం: **24**లో ఈశీర్షికలో ప్రచురించిన కథకి రచయిత్రి :*
*బి. విశాలాక్షి*
*పెట్టినపేరు : నగ్నసత్యం.*

*ఈ వారం ఈ శీర్షికలో కథల ఎన్నికల గెస్ట్ ఎడిటర్ :*
*శ్రీ వి.ఎస్.ఆర్. ఆంజనేయశాస్త్రి*



పాతంతా దండగ, కొత్తంతా మంచే అనిపించని చదువు నాది. ఆహం లేకుండా నిజాయితీతో సామాన్యుడి కోసం రూపాయెత్తు ఆలోచనా సరళితోనైనా రచయిత రాయాలన్న తత్వం నాది. అందుకని అక్షరరూపమైన ఏ రచనలోనైనా, హిపోక్రసీ వుండరాదనీ భావం నాది. ఈ దృష్టితోనే నాకిచ్చిన కథల్ని చదివాను. కలం పట్టిన ఉత్సాహం కొంతంత కనిపించింది. జల్లెడ కఠినంగానే పట్టి ఓ రెండు రచనల్ని జల్లెడలోంచి జారిపోతుండా పట్టుకున్నాను. చాలా మంది ఇచ్చిన వాక్యాన్ని కట్నాల సమస్యకో, మోసగింపు దృష్టికో, స్వార్థ పరత్వానికో అంటగట్టి కల్పన చేశారు. కొత్త స్పార్క్ కోసం వెతికాను. "నిజాయితీ", "అవిటి మనసు" దొరికాయి. శారీరకమైన అవిటితనాన్ని నిజాయితీతో జయించిన జంటను గురించి రాసిన దంతులూరి శర్మ, మానసికమైన అవిటితనాన్ని గురించి హెచ్చరికగా రాసిన ఇబీ, రామారావు పాజిటివ్‌గా రాశారనిపించింది. రచనల్లో నెగిటివ్ అప్రోచ్ ఒక ఫాషనైందిగాని దాని వల్ల పాఠకుల మనస్సులపై దుష్ప్రభావం పడుతుంది కాబట్టి పాజిటివ్ అప్రోచ్ వుంటేనే రచన ప్రయోజనకరమని నా అభిప్రాయం. ఈ ఎన్నికకు ఆ అభిప్రాయం కూడా బేస్. రాసి కన్నా వాసికి కీర్తి కన్నా ఆర్తికి ప్రాధాన్యం ఇచ్చిన కొద్దీ రచనలో ప్రామాణికత పెరుగుతుందన్న ఒక్క సూచనతో కొత్త రచయితలందరికీ ప్రభవ శుభాకాంక్షలు.

చదివారుగా నిర్మొహమాటంగా నిర్ద్వంద్వంగా సంధించిన శాస్త్రి గారి అభిప్రాయాస్త్రాల్ని! పాతిక దశాబ్దాలుగా జర్నలిజంలో తలపండిన జర్నలిస్టుగానే కాక ఆకాశవాణి ద్వారా అఖిలాంధ్ర శ్రోతలకు పరిచయం ఉన్న ఆయన్ని గూర్చి వేరుగా చెప్పనవసరం లేదు కదూ!

## "అవిటి మనసు"

క్రాలింగ్ బెల్ మోతవిని తలుపు తెరిచిన పూర్ణ ఎదురుగా సూట్‌కేస్‌తో నిలుచునివున్న భారతిని చూస్తూనే ఆనందంగా అరిచింది— "హాయ్! భారతీ" అంటూ. సూట్‌కేస్ అందుకుని లోపలికి నడుస్తూ— "ఏమిటే యింత హఠాత్తుగా ఊడిపడ్డావు? కొంపదీసి మీ ఆయనమీద అలిగి రావటంలేదుకదా:" చిలిపిగా అడిగింది,

"ఛీ నోర్ముయ్! మా ఆయన ఆఫీసు పని మీద బెంగుళూరు క్యాంప్ వెళ్ళారు. వారం రోజులందాకా రారు. ఇంట్లో ఒక్కర్తినే ఉండలేక, ఎలాగూ నిన్ను చూసి చాలాకాలం అయిందికదాని రైలెక్కి వచ్చేశాను" అన్నది భారతి సోఫాలో కూర్చుంటూ.

"మంచి పని చేశావు" అంటూ స్నేహితురాలి ప్రక్కన కూర్చుంది పూర్ణ. ఇద్దరూ కబుర్లలో పడ్డారు. కాలేజీ ముచ్చట్లతో ప్రారంభమైన ఆ కబుర్లు తమ తమ సంసారాల గురించి మాట్లాడుకునే స్థాయికి వచ్చిన తర్వాత భారతికి ఆకలేసింది.

"ఏమిటే కబుర్లేనా లేక భోజనం సంగతి చూసేదేమైనా ఉందా?" అని అడిగింది.

"నువ్వు స్నానం చేసి వచ్చెయ్యి. ఈలోపల నేను వంట రెడీ చేస్తాను" అని పూర్ణ వంటగదిలోకి నడిచింది.

భోజనాలు పూర్తయ్యాక ఇద్దరూ బెడ్ రూంలో పడుకున్నారు.

"ఏమిటే ఇంకా కబుర్లు; మీ ఆయన ఎలా వున్నారు? సంసారం ఎలా వుంది?" అని ప్రశ్నించింది భారతి.

పూర్ణ ముఖంలో నీలినీడలు చోటుచేసుకున్నాయి, మౌనంగా వుండిపోయింది ఆమె. భారతి అదుర్దాగా–

పూర్ణా! అలావున్నావేమిటి? నేనడిగిన ప్రశ్నకు జవాబు చెప్పవేం?" అని అడిగింది కాస్త అనుమానంగా

"ఏంచెప్పమంటావు భారతీ! అవిటిమనిషితో సంసారాన్నిగురించి ఏంచెప్పుకోను?" అన్నది నిర్లిప్తతతో పూర్ణ.

"మీ ఆయన అవిటివాడా? మీ పెళ్ళికి నేను రాలేకపోవటంతో ఆయన్ని చూడ్డం వీలు కాలేదు." అని మళ్ళీ– "ఏమిటి! మీ పెళ్ళికి ముందు నీ భర్త అవిటివాడని నీకు తెలీదా?" ఆశ్చర్యంగా అడిగింది భారతి తన ఫ్రెండ్ పూర్ణని.

"శరీరానికి సంబంధించిన అవిటితనమైతే తెలుసుకునివుండేదాన్నేమో కాని అయనకున్న అవిటితనం శరీరానిది కాదు. మనస్సుది" అన్నది పూర్ణ బాధగా!

"ఏమిటే పూర్ణా నువ్వంటున్నది? నాకేమీ అర్థంకావటంలేదు." అన్నది భారతి.

పూర్ణ చెప్పటం ప్రారంభించింది.

"ఇలాంటి విషయాలు నలుగురితో చెప్పుకోలేను. ప్రాణ స్నేహితురాలివి కాబట్టి నీకు చెప్పకుండా ఉండలేకపోతున్నాను. చూపులకు ఆయన ఎంత అందంగా వుంటారో? అంతఃకరణంలో అంత వికారి. ఆడవాళ్ళంటే గౌరవంలేదు. స్త్రీలను చులకనగా మాట్లాడ్డం, ఎద్దేవ చేయడం ఆయన సహజగుణాలు. నామీద ప్రతిక్షణం అనుమానమే." కాలేజీ చదువు వెలగబెట్టావు కదా? ఎవ్వరినీ ప్రేమించలేదా." అంటూ సందేహిస్తారు. "ఇంత అందంగా వున్నావు" నీ కోసం ఎవ్వరూ ప్రయత్నించలేదా?" అంటూ సంస్కారహీనంగా మాట్లాడతారు. మగవాళ్ళతో మాట్లాడితే అనుమానం. వీధిలో నిలుచుంటే తిడతారు. "నీతో సంబంధం వున్న మొట్టమొదటి మగాణ్ని నేనే కదూ!" అంటూ అసహ్యకరంగా మాట్లాడుతారు. ఈ పరిస్థితులలో నా మనసు అగ్నిగుండంలా వుడికిపోతూంది. ఈ బాధను భరించలేకపోతున్నాను" అంటూ దిండులో తలదాచుకుని వెక్కి-వెక్కి ఏడ్వడం ప్రారంభించింది పూర్ణ!

మౌనంగా స్నేహితురాలి వీపు మీద చేయి వేసి అనునయించసాగింది భారతి.

–ఇ. టి. రామారావు
(శ్రీహరికోట)

---

*స్రవంతి నెం. 22లో ఇచ్చిన "ఏమిటి, మీపెళ్ళికి ముందు నీభర్త అవిటివాడని నీకుతెలీదా?" ఆశ్చర్యంగా అడిగింది భారతి తన ఫ్రెండ్ పూర్ణని.*

*వాక్యం ఆధారంగా రాసిన కథలు*

# నిజాయితీ

గది తలుపు చప్పుడయితే భర్తేమోనని ఆత్రంగా వెళ్ళి తలుపు తీసింది పూర్ణ.

ఎదురుగా స్నేహితురాలు భారతి సూట్‌కేస్ పట్టుకొని చిరునవ్వుతో కనిపించింది.

పెళ్ళికి పిలిస్తే రానసాంకొద్దారన్నట్టుగా ఇన్నాళ్ళకు నామీద దయకలిగిందా, అని నిష్ఠూరంగా మాట్లాడుతూ భారతిని లోనికి ఆహ్వానించింది పూర్ణ.

పూర్ణ పెళ్ళికి తనెందుకు రాలేకపోయిందో సంజాయిషీ చెప్పటం మొదలుపెట్టింది భారతి.

స్నేహితురాళ్ళిద్దరూ గతం నెమరువేసుకుంటుండగా సతీష్ ఆఫీస్ నుండి వచ్చాడు.

భారతిని భర్తకు పరిచయం చేసింది. భారతి రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది. ప్రతిగా అతను కుడి చెయ్యి దర్జాగా జేబులో వుంచుకొనే సెల్యూట్ చేసినట్టుగా ఎడం చేత్తో విష్‌చేసి లోనికెళ్ళాడు.

అతని ప్రవర్తనకు భారతికి ఒళ్ళు మండింది.

"మీ ఆయనకు బొత్తిగా మర్యాద తెలియనట్టుంది" కోపం అణచుకోలేక లోనుండి వచ్చిన పూర్ణతో అంది భారతి.

"ఒక చేత్తోటే విష్ చేశారనా అలా అంటున్నావు. ఆయనకుమరి కుడిచెయి మంత వరకూ లేదు మరి" అంది పూర్ణ.

"ఏమిటి, మీ పెళ్ళికి ముందు నీ భర్త అవిటివాడని నీకు తెలీదా? ఆశ్చర్యంగా అడిగింది భారతి తన ఫ్రెండ్ పూర్ణని.

"తెలుసు"

"మరెందుకు చేసుకున్నావీపెళ్ళి" భారతి అడిగింది బాధగా.

"ఆ రోజు నా పదహారో పెళ్ళి చూపులు. నాన్న యింట్లోకి వీధిలోకి ఆత్రంగా తిరుగుతున్నారు. అమ్మ ఈ సంబంధమైనా ఖాయమయేలా చూడమని కనపడనిదేవుళ్ళకు మొక్కుకుంటున్నది. తమ్ముళ్ళు చెల్లాయిలు పెళ్ళివాళ్ళకని తెచ్చిన స్వీట్స్ తామూ తినొచ్చని ఆశగా ఎదురు చూస్తున్నారు.

పెళ్ళివారొచ్చి కూర్చున్నాక నన్ను తీసుకెళ్ళారు. ఎప్పుడొచ్చున్న భాగోతమే కదా అని నేను నిర్లిప్తంగా కూర్చున్నాను.

మీ అమ్మాయి నాకు నచ్చింది. నేను నచ్చానో లేదో అన్న గొంతు విని తలెత్తి చూశాను. ఇద్దరికళ్ళూ కలుసుకున్నాయి. సిగ్గుతో తలొంచుకున్నాను.

"నేను చెప్పమన్నది దాపరికం లేకుండా చెప్పారా పేరయ్య గారూ" అతను అడిగాడు.

బాబూ! మీరు మంచి ఉద్యోగం చేస్తూ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకొంటున్నారు .... అదే పది వేలంటూ" నసిగాడు పేరయ్య.

ఇక ఆపండి. అయ్యా సుబ్బారామయ్య గారూ ఫ్యాక్టరీ మెషిన్ చక్రంలో పడి నా చెయ్యి మంచి వరకూ పోయింది నాకు అబద్ధం ఆడి పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. మీ అమ్మాయికి, మీ కుటుంబ సభ్యులకు నచ్చితే కబురు చెయ్యండి" అతను వెళ్ళిపోయాడు.

నేను ఆలోచనలోపడ్డాను. అడిగినంత కట్నం ఇవ్వలేమని తెలిసి నాకు లేని అవలక్షణాలు అంటగట్టేవారు కొందరయితే, చేసేది చిన్న గుమస్తా ఉద్యోగమైనా గాని గొంతెమ్మకోర్కెలు కోరే వారు ఇంకొందరు సర్వ వ్యసనాలు వుండి కూడా బుద్ధిమంతులమని అబద్ధాలు చెప్పే వారు మరి కొందరూ వున్న ఈ రోజుల్లో అతని నిజాయితీ నాకు నచ్చింది.

"అదే పెళ్ళయిన తరువాత చెయ్యిపోతే కాపురం చెయకుండా వదిలేస్తారా ఎవరైనా" అంది పూర్ణ.

భారతి తన తొందరపాటుకి సిగ్గుపడింది.

"పూర్ణ" అన్న భర్త పిలుపు విని ఇప్పుడే వస్తానంటూ లోనికి వెళ్ళింది పూర్ణ.

"అందగాడని మోజుపడి ఆనంద్‌ని పెళ్ళి చేసుకుంటే రోజుకో అమ్మాయిని యింటికే తీసుకొచ్చి తన కళ్ళ ముందే కులుకుతుంటటం గుర్తొచ్చిన భారతి పూర్ణ భర్త నిజాయితీని మనసులోనే అభినందించింది.

–దంతులూరి వర్మ
(విశాఖపట్నం-...)

---

## ఓకథ రాయండి

ఈ క్రింది ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడైనా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయల పారితోషికం పంపబడుతుంది.

*'ఆ ప్రకాశ్, ఈ ప్రకాశ్ ఒకడేనా?' కాకుంటే బావుండునని మనసులో అనుకుంటూ నడుస్తోంది జానకి.*